

వేగంగా సెల్‌ఫోన్ల రికవరీ
సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు జిల్లా పోలీసులు అండగా నిలుస్తున్నారు. క్యాట్ టీం ద్వారా వీలైనంత త్వరగా రికవరీ చేసి అందజేస్తున్నారు. 18లో



టమాట కిలో రూ.20
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి రూ.12 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
31.6°/11.5°

జిల్లాలో బుధవారం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవగా.. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

వెబ్‌సైట్‌లో 'నవోదయ' హాల్‌టికెట్లు
లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో (2023-2024 విద్యా సంవత్సరానికి) 9వ తరగతిలో ఖాళీ సీట్ల కోసం ఈనెల 11న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు (అడ్మిట్ కార్డులు) https://www. nvsadmissionclassnine. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని లేపాక్షి విద్యాలయ ప్రిన్సిపల్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేపాక్షి కేంద్రంలో పరీక్షకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఏవైనా సందేహాలుంటే 9402052201, 7893030442, 9490766360 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు. అలాగే ఆరో తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు ఈ నెల 8వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

'నాడు- నేడు' పనులు వేగవంతం చేయాలి


అగళి ఎమ్మార్సీలో సమీక్షిస్తున్న డీఈఓ మీనాక్షి

మడకశిర(అగళి)/రొళ్ల : ప్రభుత్వ పాఠశాలల్లో 'నాడు-నేడు' కింద చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఆదేశించారు. బుధవారం ఆమె అగళి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మార్సీ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో జరుగుతున్న రెండో విడత 'నాడు- నేడు' పనులపై సమీక్షించారు. పాఠశాలల వారీగా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నందున పిల్లలను సన్నద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

కాకి ఉన్నత పాఠశాల తనిఖీ
సాయంత్రం ఆమె రొళ్ల మండలంలోని కాకి ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ట్యాబ్‌లు సక్రమంగా పని చేస్తున్నాయా.. లేదా... అని అడిగి విద్యార్థుల ను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నందున అందరూ ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. అదేవిధంగా 'నాడు-నేడు' పథకం కింద పాఠశాలకు మంజూరైన మరుగుదొడ్లు, ప్రహరీ, ఇతరాత్ర పనులను పరిశీలించి వేగవంతం చేయాలని సూచించారు.

అహ్మదాబాద్-తిరుచునాపల్లి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు
గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అహ్మదాబాద్-తిరుచునాపల్లి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల రెండో తేదీ (గురువారం) అహ్మదాబాద్ జంక్షన్ నుంచి (09419) ఈ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరుతుంది. తిరుచునాపల్లి జంక్షన్ నుంచి ఈ నెల 5(ఆదివారం)న అహ్మదాబాద్‌కు బయలుదేరుతుంది. ఈ రైళ్లు మార్చి 30 వరకు ప్రతి గురు, ఆదివారాల్లో రాకపోకలు సాగిస్తాయి. ఈ రైళ్లు రాయలసీమలోని మంత్రాలయం, గుంతకల్లు, తాడిపత్రి, వైఎస్సార్ కడప, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

యువకుడి దారుణ హత్య


సంఘటనా స్థలంలో నాగరాజు మృతదేహం

చిలమత్తూరు: పొలంలో పనిచేస్తున్న యువకుడిపై కొందరు దుండగులు వేట కొడవళ్లతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన బుధవారం మండలంలోని సోమఘట్టలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు...సోమఘట్టకు చెందిన నాగరాజు(30) మరో వ్యక్తితో కలిసి బుధవారం ఉదయం గ్రామానికే చెందిన ఓ రైతు పొలంలో డ్రిప్ పైపులు బిగించడానికి వెళ్లాడు. పైపులు బిగిస్తుండగా...సుమారు 10.30 సమయంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికి చేరుకొని నాగరాజుపై విచక్షణారహితంగా వేట కొడవళ్లతో తలపై నరికారు. దీంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజుతో కలిసి పనికి వచ్చిన వ్యక్తి మరోకచోటుకు వెళ్లడం, అదే సమయంలో దుండగులు వేటకొడవళ్లతో దాడి చేసినట్టుగా ప్రత్యక్షసాక్షి అంజినప్ప చెబుతున్నారు. ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షితో హత్యకు గల కారణాలను ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. నాగరాజుకు భార్యతో పాటు రెండేళ్ల కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి వచ్చిన నాగరాజు కుటుంబీకులు మృతదేహంపై పడి బోరున విలపించారు.

పద్దు.. పొడవలేదు

- వెనుకబడిన జిల్లాకు దక్కని ఆర్థిక దన్ను
- సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీకి గతేడాది కంటే తగ్గిన నిధులు
- వేతన జీవులకు మాత్రమే ఊరట
- కేంద్ర బడ్జెట్‌పై ప్రముఖుల పెదవి విరుపు
- శ్రీసత్యసాయి జిల్లా ప్రస్తావన రాలేదని మండిపాటు

ప్రశాంతి నిలయం: నిర్మలమ్మ ట్రైన్ ప్రశాంతి నిలయంలో ఆగకుండానే వెళ్లిపోయింది. నూతన ప్రాజెక్టుల ప్రస్తావనే లేకుండా బుల్లెట్ ట్రైన్‌లా ఎన్నికల రాష్ట్రం కర్ణాటకకు దూసుకెళ్లింది. కేటాయింపుల్లోనూ ఆంధ్రాకోడలు నిర్మలా సీతారామన్ నూతన జిల్లా శ్రీసత్యసాయికి మొండిచేయి చూపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ బుధవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. రాష్ట్రానికి సరైన కేటాయింపులు లేకపోవడంతో జిల్లాకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో వివిధ పార్టీల ప్రతినిధులతో పాటు మేధావులు పెదవివిరిచారు.

నిధుల ఊసేలేదు
కేంద్ర బడ్జెట్‌లో వెనుకబడిన జిల్లాలకు ఏటా అందజేయాల్సిన రూ.50 కోట్లు చూపలేదు. దీనివల్ల రాయలసీమతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు నష్టపోవాల్సి వస్తోంది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న మేరకు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీని అనంతపురంలో ఏర్పాటు చేశారు. దీనికి తాజా బడ్జెట్‌లో రూ.47 కోట్లు మాత్రమే కేటాయించారు. గత బడ్జెట్ (2021-22)లో రూ.60.35 కోట్లు కేటాయించగా..ఈసారి రూ.13.35 కోట్లు తక్కువ ఇవ్వడం గమనార్హం. అనంతపురం జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఒకే ఒక్క ఉన్నత విద్యా సంస్థకూ తక్కువ నిధులు కేటాయించడంపై విద్యావేత్తలు మండిపడుతున్నారు. యూనివర్సిటీ భవనాలు, పూర్తి స్థాయి క్యాంపస్ 2024 సంవత్సరంలోపు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కానీ ఆ స్థాయిలో కేటాయింపులు ఉండడం లేదు. 2019-20లో రూ.60.35 కోట్లు కేటాయించగా.. ఆ మొత్తాన్ని ఖర్చు పెట్టలేదు. 2020-21లో కేవలం రూ.4.80 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రస్తుత కేటాయింపులు వర్సిటీ నిర్వహణ, వేతనాలకు కూడా చాలవని అంటున్నారు. ఇక శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం వద్దనున్న నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్)కు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు.

యువతకు డిజిటల్ లైబ్రరీలు
వర్సిటీల్లో స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించేలా బడ్జెట్‌లో ప్రతిపాదనలు జరిగాయి. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రధాన వర్సిటీల్లోనూ ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. మారుతున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పరిశ్రమల అభివృద్ధి, ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ సెల్ ఏర్పాటుతో పాటు యువత, పాఠశాల విద్యార్థులకు నేషనల్ డిజిటల్ లైబ్రరీలను అందుబాటులోకి తేనున్నారు. దీనివల్ల జిల్లా విద్యార్థులకు కూడా లబ్ధి కలిగే అవకాశముంది.

అన్నదాతలకు నిరాశ
ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షలాదిమంది రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వారికి పెద్దగా ఊరట కల్గించే అంశాలేవీ కేంద్ర బడ్జెట్‌లో లేవు. పంటలకు మద్దతు ధరలు, రుణ మాఫీ, పంటల బీమా, హార్టికల్చర్ హబ్‌కు నిధుల కేటాయింపు లేకపోవడంతో రైతులు, రైతుసంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రుణ వితరణ లక్ష్యం పెంపు, చిరుధాన్యాల సాగు, వ్యవసాయ అంకుర సంస్థలకు ప్రోత్సాహం వంటి చర్యలు జిల్లా రైతులకు కాస్త ఊరటనిచ్చేవే అయినా గరిష్ట లబ్ధి మాత్రం కలగదని అంటున్నారు.





మధ్య తరగతికి అన్యాయం
బడ్జెట్‌లో మధ్య తరగతికి ఎలాంటి ఊరట లేదు. పరిశ్రమల ప్రస్తావన లేదు. బెల్. నాసన్ సంస్థలకు కేటాయింపులు లేవు. ఇన్‌కం ట్యాక్స్ శ్లాబ్స్ విషయంలో కేంద్రం వైఖరి సరికాదు. ఏకపక్ష నిర్ణయాలతో ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలకు అన్యాయం చేశారు. **– గోరంట్ల మాధవ్, ఎంపీ, హిందూపురం**

నిరాశ మిగిల్చింది



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. పొరుగు రాష్ట్రం కర్ణాటక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు స్పష్టం అవుతోంది. నూతనంగా ఏర్పడిన శ్రీ సత్యసాయి జిల్లాకు కేటాయింపులు లేకపోవడం బాధాకరం. పరిశ్రమలు, ప్రాజెక్టులు వస్తాయని ఆశించాం. కేంద్ర బడ్జెట్ నిరాశ మిగిల్చింది.
– శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

వేతన జీవులకు మేలు



జనరంజక బడ్జెట్ ఇంది. సెంట్రల్ వర్సిటీ ఆఫ్ ఏపీకి రూ.47 కోట్లు, ఏపీ పెట్రోలియం వర్సిటీకి రూ.168 కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.683 కోట్లు కేటాయించడం శుభ పరిణామం. పన్ను పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచి వేతన జీవులకు ఊరట కల్పించారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం 38 వేల మంది ఉపాధ్యాయులను నియమిస్తారని చెప్పడం ఆనందదాయకం. అన్ని వర్గాలను దృష్టి ఉంచుకుని ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది.
– వజ్ర భాస్కర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఉపయోగం లేని బడ్జెట్



కేంద్రబడ్జెట్ పై గంపెడాశలు పెట్టుకున్నాం. కానీ తీవ్ర నిరాశ పరిచారు. జిల్లాకు ఏమాత్రం ఉపయోగం లేని బడ్జెట్ ఇది. అన్ని వర్గాలకు అన్యాయమే. కొత్తగా ఏర్పడిన జిల్లాకు ఒక్క కేటాయింపు కూడా లేకపోవడం బాధాకరం. అంకెల గారడీతో బురిడీ కొట్టించారు. ఈ బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేదేమీ లేదు.
– బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఇతోధికంగా నిధులు



ఆదాయపు పన్ను శ్లాబులు మార్చడం చిరు,మధ్యతరగతి ఉద్యోగులకు ఊరట కల్గించే అంశం. యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ , మైనార్టీల అభివృద్ధికి ఇతోధికంగా నిధులు కేటాయించారు. సమ్మిళిత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వీరందరికీ నిధులు ఎక్కువగా కేటాయిస్తున్నట్లు ప్రకటించడం సంతోషదాయకం. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీకి మాత్రం ఆశించినంత మేర నిధులు కేటాయించలేదు.
–ప్రొఫెసర్ ఎండీ బావయ్య, ఎకనామిక్స్ ప్రొఫెసర్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ

పేదలకు మొండిచెయ్యి



రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఊసే లేదు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా వంటి ప్రత్యేక ప్యాకేజీ చెప్పలేదు. పోలవరం ప్రాజెక్టు నిధుల గురించి ప్రస్తావించలేదు. ఏడాదికి కోటి ఉద్యోగాల మాట లేదు. అమరావతి రాజధానికి నిధుల విషయమై పేర్కొనలేదు. అంతిమంగా పేదలకు మొండి చేయి చూపారు.
– వేమయ్య యాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి

సీనియర్ సిటిజన్లకు ఊరట



కేంద్ర బడ్జెట్‌లో సీనియర్ సిటిజన్ల డిపాజిట్ గరిష్ట పరిమితిని రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచారు. అదే విధంగా సేవింగ్స్ అకౌంట్ పరిమితిని రూ.4.5 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెంచారు. ఇప్పటి నుంచి గతంలో ఉన్న 80సీ కింద మినహాయింపులు చూపించుకోవాలంటే పాత పన్ను పద్ధతిని ఎంచుకోవాలి. కావాలంటే కొత్త పన్ను విధానంలోనూ ట్యాక్స్ చెల్లించే వెలుసుబాటు కల్పించారు.
– రాధాకృష్ణారెడ్డి, అకౌంటెంట్, పుట్టపర్తి

చంద్రబాబుకు మైండ్ దొబ్బింది

- ఏ భాష మాట్లాడుతున్నాడో లోకేష్‌కే తెలియాలి
- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ విమర్శలు


విలేకరులతో మాట్లాడుతున్న మాలగుండ్ల శంకరనారాయణ

పరిగి: లోకేష్ యాత్రపై గంపెడాశలు పెట్టుకున్న చంద్రబాబుకు వాస్తవ పరిస్థితి చూసి మైండ్ దొబ్బిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. అసలు లోకేష్ ఏ భాష మాట్లాడుతున్నాడో అతనికే తెలియాలన్నారు. ఎందుకంటే పాదయాత్రలో ఉన్న తెలుగు తమ్ముళ్లకే ఆయనేం మాట్లాడుతున్నాడో అర్థం కాక జుట్టుపీక్కుంటున్నారన్నారు. బుధవారం శంకరనారాయణ పరిగి మండలంలో విలేకరులతో మాట్లాడారు. శుద్ధప్పుతో పాదయాత్ర చేయిస్తున్నందుకు పార్టీ శ్రేణులే సిగ్గుతో తల దించుకుంటున్నాయని అన్నారు. పాదయాత్రలో కనీసం వంద మంది లేకపోవడంతో ఆపార్టీ నాయకులు జనాన్ని తరలించడానికి అష్టకష్టాలు పడుతున్నారన్నారు. దీంతో లోకేష్ పాదయాత్రకు పబ్లిసిటీ ఇచ్చేందుకు వచ్చ మీడియా సైతం వెనకాడే పరిస్థితి నెలకొందన్నారు. చరిష్మా లేని లోకేష్‌కు ప్రజల స్థితిగతులు తెలియకపోవడంతో రాష్ట్ర ప్రజలంతా నవ్వుకుంటున్నారన్నారు. ఇప్పటికే దిగజారిన టీడీపీ పరిస్థితి లోకేష్ పాదయాత్రతో ఎత్తిపోయిందన్నారు.

అక్రమాలకు మారుపేరు టీడీపీ నేతలు
పెనుకొండ నియోజకవర్గంలోని టీడీపీ నేతలు అక్రమ మైనింగ్‌లు, అక్రమ వ్యాపారాలు చేస్తూ దందాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. అక్రమంగా మైనింగ్ చేస్తూ పట్టుబడిన టీడీపీ నాయకురాలు సవితమ్మ గురించి లోకేష్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. బీసీలపై, కురుబలపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ సవితమ్మ చేస్తున్న ఆరోపణల్లోనూ అర్థం లేదన్నారు. ఆమె అక్రమ మైనింగ్ వ్యాపారంతో పాటూ కర్ణాటక నుంచి పెట్రోల్, డీజిల్ తెచ్చి ఆంధ్రలో అమ్ముతుండటంతోనే విజిలెన్స్ అధికారులు దాడులు చేశారన్నారు. ఇది కూడా తెలియని లోకేష్...సవితమ్మను వెనుకేసుకురావడం దారుణమన్నారు. బీసీలకు పెద్ద పీట వేసిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న బీసీలను బ్యాక్‌బోన్ క్యాస్ట్‌గా చూస్తూ అన్ని విధాలా పెద్దపీట వేస్తున్నారన్నారు. ఇది చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లుతున్నారన్నారు. కనీసం బీసీల్లో ఎన్ని కులాలున్నాయో కూడా తెలియని టీడీపీకి బీసీల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

తలుపుతట్టి...కానుకనిచ్చి

- తెల్లవారుజామునుంచే వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ
- తొలిరోజే 88 శాతం మందికి సొమ్ము అందజేత


వెంగళమ్మ చెరువులో పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న వలంటీర్ చంద్రశేఖర్

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ జిల్లాలో జోరుగా సాగింది. తెల్లవారుజామునే వలంటీర్లు తలుపుతట్టి మరీ లబ్ధిదారులకు పింఛన్ మొత్తం అందజేయడంతో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల మోముల్లో ఆనందం కనిపించింది. ఫిబ్రవరి నెలకు సంబంధించి జిల్లాలోని 2,66,045 మంది లబ్ధిదారులకుగాను ప్రభుత్వం రూ.73,82,47,500 విడుదల చేసింది. ఈ మొత్తం మంగళవారం సాయంత్రమే వలంటీర్లకు చేరడంతో వారు తెల్లవారుజాము నుంచే పంపిణీ ప్రారంభించారు. దీంతో తొలిరోజే 2,33,139 మంది లబ్ధిదారులకు (88 శాతం) రూ.64,66,17,750 నగదు అందజేశారు. పింఛన్ పంపిణీకి మరో నాలుగు రోజులు గడువు ఉన్నందున వందశాతం పంపిణీ పూర్తి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

నోటి క్యాన్సర్‌కు చెక్!

ప్రజల ఆరోగ్యంపై జగన్ సర్కార్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. అధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకుంటోంది. పేదలకు ప్రభుత్వాస్పత్రుల్లోనే ఉచితంగా ఖరీదైన వైద్యం అందించేందుకు కృషి చేస్తోంది. తాజాగా నోటి క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి.. వ్యాధికి చెక్ పెట్టేందుకు శ్రీకారం చుట్టింది. వైద్యులకు శిక్షణ ఇచ్చిన అనంతరం వెల్‌స్కోప్ మెషీన్లు ఏర్పాటు చేసి క్యాన్సర్ పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

- వెల్‌స్కోప్ మెషీన్లు అందుబాటులోకి..
- లక్షణాలను ముందస్తుగా గుర్తించే అవకాశం
- అనంత, సత్యసాయి జిల్లాల వైద్యులకు కడపలో శిక్షణ
- శిక్షణానంతరం జిల్లాల్లో వెల్‌స్కోప్ మెషీన్ల ఏర్పాటు


వెల్‌స్కోప్ మిషన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పొగాకు, పొగాకు మసాలాలతో పాటు బీడీలు, సిగరెట్ తాగుతున్న వారిలో నోటి క్యాన్సర్ తీవ్రమవుతోంది. ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించుకుంటున్న క్యాన్సర్ బాధితుల్లో ఆరు శాతం మంది నోటి క్యాన్సర్ (ఓరల్ క్యాన్సర్) వారే ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజురోజుకూ దీని తీవ్రత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ముందే ఓరల్ క్యాన్సర్‌ను పసిగట్టే చర్యల్లో భాగంగా ప్రభుత్వం సరికొత్త టెక్నాలజీతో నిర్ధారణ పరీక్షలు చేస్తోంది. ప్రాథమిక క్యాన్సర్ దశకు రాకముందే.. లేదంటే అలాంటి లక్షణాలు కనిపించకముందే క్యాన్సర్ స్థితిని ఓ పరికరం ద్వారా అంచనా వేస్తారు. ఇలాంటి పరికరాలను ఏపీ సర్కారు అందుబాటులోకి తెచ్చింది.

వెల్‌స్కోప్ మెషీన్ ద్వారా పరీక్షలు..
వెల్‌స్కోప్ మెషీన్ అంటేనే ఇదొక అత్యాధునిక వైద్యపరికరం. తరంగ దైర్ఘ్యాల నీలి కాంతిని ప్రేరేపణ చేసి నోటిలో ఉన్న పరిస్థితులను అంచనా వేస్తుంది. క్యాన్సర్ వచ్చే లక్షణాలను ముందే పసిగట్టగలిగే సామర్థ్యం ఉంటుంది. ప్రీ క్యాన్సర్ లక్షణాలే క్యాన్సర్‌కు దారితీస్తాయి. వాటిని ముందే గ్రహించి చెప్పగలదు. ఇలాంటి వెల్‌స్కోప్ మెషీన్లను వైజాగ్, విజయవాడ, కడపలో ఏర్పాటు చేశారు. కడపలో ఏర్పాటు చేసిన ఈ మెషీన్ పరిధిలో 9 జిల్లాల వైద్యులకు శిక్షణ ఇస్తారు. ఇందులో శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలు ఉన్నాయి.

అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో...
పీహెచ్‌సీ వైద్యులు, దంతవైద్యులకు వెల్‌స్కోప్ మెషీన్ ద్వారా శిక్షణ నిచ్చిన అనంతరం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోనూ వెల్‌స్కోప్ మెషీన్లు ఏర్పాటు చేస్తారు. మెషీన్ల ఏర్పాటు అనంతరం భారీ స్థాయిలో నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. ఇలా ముందే లక్షణాలను గుర్తించి చికిత్స చేస్తే వేలాదిమంది ప్రాణాలను కాపాడవచ్చనేది వైద్యుల అభిప్రాయం. ఓ వైపు నిర్ధారణ పరీక్షలు చేస్తూనే అదే ప్రాంతంలో మరోవైపు పొగాకు ఉత్పత్తుల వాడకం నియంత్రణపై కౌన్సెలింగ్ ఇస్తారు. ప్రస్తుతం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వైద్యులకు ఈ మెషీన్ ద్వారా నిర్ధారణ పరీక్షలు ఎలా చేయాలో శిక్షణ ఇస్తున్నారు.

క్యాన్సర్ బారినుంచి కాపాడవచ్చు



నోటి క్యాన్సర్ తీవ్రత ఎక్కుగా ఉంది. ముందస్తు లక్షణాలు గుర్తించి చికిత్స అందిస్తే వ్యయభారం తగ్గుతుంది. భవిష్యత్‌లో ఇది అన్ని చోట్లా విస్తరిస్తే మరింతగా లబ్ధి కలుగుతుంది. ముఖ్యంగా పొగాకు వాడకంతో క్యాన్సర్‌కు గురయ్యేవారిని క్యాన్సర్ బారినుంచి కాపాడచ్చు.
– డాక్టర్ శ్రీనివాసన్, క్యాన్సర్‌కేర్ నోడల్ ఆఫీసర్

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నుంచి లక్ష్మీనరసప్ప బహిష్కరణ

సాక్షి, పుట్టపర్తి: గోరంట్ల మండలం వెంకటరమణపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మీనరసప్పను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నిబంధనలు ఉల్లంఘించిన నేపథ్యంలో క్రమశిక్షణా రాహిత్యం కింద బహిష్కరణ వేటు వేసినట్లు చెప్పారు. పార్టీ నిబంధనలు పాటించిన వారికే కొనసాగే అర్హత ఉంటుందన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎలాంటి కార్యకలాపాలకు పాల్పడినా వేటు తప్పదని హెచ్చరించారు.

హంద్రీనీవా కాలువ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ దేశేనాయక్

మడకశిర: నియోజకవర్గంలోని మండలాల్లో బుధవారం హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్ పర్యటించారు. కదిరేపల్లి, జంబులబండ తదితర గ్రామాల్లో పర్యటించి హంద్రీనీవా తాత్కాలిక పనులను పరిశీలించారు. ప్రభుత్వం ఈ పనులకు రూ.2.31 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ పనులను ఎస్ఈ పరిశీలించారు. వేగంగా పనులను పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా మడకశిరలో ఎమ్మెల్యే తిప్పేస్వామితో సమావేశమై పనుల పురోగతిపై వివరించారు. జాప్యం చేయకుండా పనులు పూర్తి చేసి అమరాపురం మండలానికి కృష్ణాజలాలు అందించాలన్నారు.

చెట్టును ఢీ కొన్న కారు



సోమందేపల్లి: మండలంలోని మేకలపల్లి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. కర్ణాటకలోని తుమకూరు నుంచి హైదరాబాద్‌కు అంజాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళుతుండగా మేకలపల్లి వంక వద్ద అదుపు తప్పి చెట్టును ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. అందులో ఉన్న ముగ్గురు స్వల్పంగా గాయపడటంతో సర్పంచ్ పరంధామతో పాటు స్థానికులు చికిత్స కోసం వారిని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేగంగా సెల్‌ఫోన్ల రికవరీ

- సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న పోలీసుశాఖ
- పోయిన సెల్‌ఫోన్లు అందిస్తుండటంతో బాధితుల హర్షం



రికవరీ చేసిన సెల్‌ఫోన్లు



బాధితునికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో పోలీస్‌శాఖ కూడా అందుకు అనుగుణంగా పని చేస్తూ నిందితుల ఆటకట్టిస్తోంది. ముఖ్యంగా సెల్‌ఫోన్ల రికవరీలో వేగం పెంచి పోలీస్‌శాఖ పేరు ప్రతిష్టలు పెంపొందిస్తున్నారు.

క్యాట్ టీం ఏర్పాటు

జిల్లాలో ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రికవరీ కోసం ప్రత్యేకంగా క్యాట్ (కాల్ అనాలసిస్) టీంను ఏర్పాటు చేశారు. దీనిపై ప్రజల్లోనూ అవగాహన పెంపొందిస్తుండటంతో పెద్ద సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే క్యాట్ బృందం సెల్‌ఫోన్ కేసులను ఛేదించి బాధితులకు అందజేస్తున్నారు. వేలాది రూపాయలు విలువ చేసే ఫోన్లు రికవరీ చేసి ఇస్తుండటంతో బాధితుల ఆనందానికి అవధుల్లేకుండా పోతోంది.

ఇలా ఫిర్యాదు చేయాలి

సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగిలించబడిన వెంటనే సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్‌తో పాటు వివరాలను వాట్సాప్ నంబర్ 6305800426కు వివరాలు పంపితే వెంటనే క్యాట్ టీం రంగంలోకి దిగుతుంది. సరైన వివరాలు అందజేసిన కేసుల్లో వారంలోపే సెల్‌ఫోన్ రికవరీ చేసిన సందర్భాలు ఉన్నాయి.

120 సెల్‌ఫోన్ల రికవరీ

ఈ పది నెలల కాలంలో 980 కేసులు నమోదు కాగా ఇప్పటి వరకూ 120 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. సెల్‌ఫోన్ దొంగిలించిన తరువాత అందులో ఎన్ని సిమ్‌లు మార్చినా పసిగట్టవచ్చని క్యాట్ టీం సభ్యులు చెబుతున్నారు.

సాంకేతికతతో నేరాలకు చెక్



సెల్‌ఫోన్ల రికవరీలో సాంకేతికత చాలా ఉపయోగపడుతోంది. బాధితులు సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు గానీ, ఆన్‌లైన్‌లోగానీ ఫిర్యాదు చేయొచ్చు. వివరాలు పూర్తిగా ఉంటే రికవరీ చేయడం మరింత సులభమవుతుంది. ప్రజల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నాం.

– రాహుల్ దేవ్ సింగ్, ఎస్పీ

సమీర్‌శర్మ పర్యటన విజయవంతం చేయండి



పెదపల్లి సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: మాజీ సీఎస్ , ముఖ్యమంత్రి ముఖ్య కార్యనిర్వహణా అధికారి సమీర్‌శర్మ ఈనెల 7, 8 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా స్టాటిస్టికల్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి, పెడపల్లి1, 2 సచివాలయాలను, పుట్టపర్తి పట్టణంలోని ఎనుములపల్లి, ప్రశాంతి గ్రామం సచివాలయాలను పరిశీలించారు. సమీర్‌శర్మ పర్యటనలో భాగంగా అర్బన్‌లో ఒకటి, రూరల్‌లో ఒక సచివాలయాన్ని సందర్శిస్తారని విజయ్‌కుమార్ తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ)పై ఆయన సమీక్షిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, యువతుల రక్తహీనత లోపాలపై క్షేత్రస్థాయిలో వివరాలను పరిశీలించనున్నట్లు చెప్పారు. బుధవారం ఆయా సచివాలయాల్లో రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ సాయిప్రసాద్, ఎస్ఓ రమేష్, ఏఎస్ఓ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బొలెరోను ఢీకొన్న కారు

- పలువురికి గాయాలు



క్షతగాత్రులకు ధైర్యం చెబుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని సీతారాంపల్లి వద్ద జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ముందు వెళ్తున్న బొలెరో వాహనాన్ని వెనుక వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అందులో ఉన్న మామిళ్లపల్లిలోని పూసల కాలనీకి చెందిన శ్రీదేవి, కుళ్లాయప్ప, వన్నూరమ్మ, కదిరమ్మ గాయపడ్డారు. అదే రహదారిలో వెళ్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తన వాహనాన్ని క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు. వెంటనే స్థానికుల సహాయంతో వారిని చికిత్స నిమిత్తం 108లో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆర్‌బీకేల్లో అన్ని రకాల సేవలు

- జిల్లా అగ్రి బోర్డు చైర్మన్ ఆవుటాల



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి

నల్లమాడ: 'రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి.. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలి' అని జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని కురుమాల రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ లింగమూర్తి అధ్యక్షతన బుధవారం రైతులకు అవగాహనా సమావేశం నిర్వహించారు. రమణారెడ్డి మాట్లాడుతూ ఈ–క్రాప్ బుకింగ్, వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సదుపాయాలతో పాటు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఆర్‌బీకేల్లో వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి పంటల సాగు, సస్యరక్షణ, అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించి పంట దిగుబడిలో రైతులు అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, ఏఓ సుమతి, వైఎస్సార్ సీపీ నాయకులు అశోక్‌రెడ్డి, రాజారెడ్డి, హబీబుల్లా, గిరిజాపతి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన ఆంధ్ర, బిహార్ మ్యాచ్



తలపడుతున్న ఆంధ్ర, బిహార్ జట్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: బీసీసీఐ ఆధ్వర్యంలో జిల్లా, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ల సంయుక్త నేతృత్వంలో అనంత క్రీడా మైదానం వేదికగా నిర్వహించిన కల్నల్ సీకే నాయుడు క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. నాల్గవ రోజు ఆటను బుధవారం ఆంధ్ర, బిహార్ జట్లు కొనసాగించాయి. ఆంధ్ర జట్టు 9 పరుగులతో లీడ్ సాధించగా, నాల్గవ రోజు ఆటను బిహార్ జట్టు 70 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో ప్రారంభించింది. ఆట ముగిసే సమయానికి 88.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 249 పరుగులు చేసింది. బిహార్ జట్టు బ్యాట్స్‌మెన్లలో అంకిత్‌రాజ్ 81, పరంజీత్ సింగ్ 78 పరుగులతో రాణించారు. ఆంధ్ర జట్టు బౌలర్లలో మహీప్, ఆంజినేయులు, ఇస్మాయిల్, కేఎస్ఎన్ రాజులు చెరో వికెట్‌ను సాధించారు. చివరి రోజు ఆటను టీ బ్రేక్‌లో ఇరు జట్ల క్యాప్టెన్ల సమ్మతంతో డ్రాగా ముగించారు. ముగింపు కార్యక్రమానికి మ్యాచ్ రెఫరీ శక్తి సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు అద్భుతమైన ఆటతీరుతో అలరించారన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు, అంపైర్లు భారతివిజ్, రాజేష్ కన్నన్, స్కోరర్లు విజయ్, చైతన్య, వీడియో అనాలిస్ట్ రహిమాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన క్రికెట్ మ్యాచులు



క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి హాజరైన క్రీడాకారులతో ముఖ్య అతిథులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాయలసీమ స్థాయి క్రిస్టియన్ యూత్ క్రికెట్ పోటీలు బుధవారం స్థానిక నీలం సంజీవరెడ్డి క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. రాయలసీమ బిషప్ ఐజాక్ వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సాహించే ఉద్దేశంతో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు క్రిస్టియన్ యూత్ క్రికెట్ టోర్నీని నిర్వహించడం గర్వకారణమన్నారు. రాయలసీమ జిల్లాలకు చెందిన మొత్తం 12 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. తొలి రోజు నిర్వహించిన మ్యాచుల్లో గుత్తి జట్టు పై ఆళ్లగడ్డ , ప్రొద్దుటూరుపై జమ్మలమడుగు జట్టు, పులివెందులపై కడప జట్టు విజయం సాధించాయి. ఈ నెల 6న అనంత క్రీడా గ్రామంలోని ప్రధాన క్రీడా మైదానంలో ఫైనల్ పోటీలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పాస్టర్ ప్రేమ్‌బాబు, యూత్ డైరెక్టర్ న్యాషి, పాస్టరేట్ కమిటీ సభ్యులు, యూత్ లీడర్లు ప్రశాంత్, సుకాంత్, స్టీవ్, ప్రమోద్, డ్యానీ తదతరులు పాల్గొన్నారు.

కొడుకులనే గెలిపించుకోలేని దద్దమ్మలు జేసీ బ్రదర్స్

- ఎమ్మెల్యేలు పెద్దారెడ్డి, వెంకట్రామిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ధర్మవరం ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి , చిత్రంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: తన కొడుకులను ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిపించుకోలేని దద్దమ్మలు జేసీ సోదరులని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి నిర్వహిస్తున్న ప్రజా సంక్షేమ యాత్రకు ధర్మవరం ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. మేడిమాకులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. గతంలో ఎవరైనా జేసీ బ్రదర్స్‌కు ఎదురు తిరిగితే వారిని హత్య చేయించడానికి కొందరు అమాయకులను ప్రేరేపించి గ్రామాల్లో కక్షలు పెంచేవారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అలాంటి పరిస్థితి గ్రామాల్లో ఎక్కడా లేదన్నారు. కొన్ని టీవీ ఛానళ్లలో జేసీ సోదరులను టీడీపీ సీనియర్ నాయకులుగా సంబోధిస్తున్నారని, వారు టీడీపీ సీనియర్ నాయకులు ఎలా అవుతారో చెప్పాలన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జేసీ సోదరులు వారి ఆధిపత్యం కోసం ఎంతోమంది టీడీపీ కార్యకర్తలను చంపించలేదా అని ప్రశ్నించారు. ఎంతమంది మహిళల తాళిబొట్లు తెంచారో చెప్పాలన్నారు.

జేసీ సోదరులను తరిమికొట్టండి..

ప్రస్తుతం మాజీ సీఎం చంద్రబాబు తన కొడుకు లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి అష్టకష్టాలు పడుతున్నాడని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ని ఢీకొనే శక్తి నారా లోకేష్‌కు లేదని స్పష్టం చేశారు. మర్యాద ఇవ్వడం తెలియని మూర్ఖులు జేసీ బ్రదర్స్‌ను నియోజక వర్గం నుంచి తరిమికోట్టాలని పిలుపునిచ్చారు. రాజకీయ లబ్ధికోసం ఎంతకైనా దిగజారుతారని చెప్పారు. కుల, మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు.

లోకేష్ ఏమీ చెప్పుకోలేకపోతున్నారు

తాడిపత్రి: యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ టీడీపీ హయాంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి మేలు చేయకపోవడంతోనే ఏమీ చెప్పుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాలు బాగుండాలి, వారి పిల్లలు విద్యావంతులుగా తయారవ్వాలి, ఫ్యాక్షన్ జోలికి వెళ్లవద్దు అన్న సందేశంతో పాటు ప్రజలకు ఇంకా ఏం మేలు చేయగలమన్న ఆలోచనతోనే చిన్నాన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజాసంక్షేమ యాత్ర చేస్తున్నారన్నారు. జేసీ సోదరుల్లాంటి వెధవలను ఆదరిస్తే మీ జీవితాల్లో సర్వం కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత... జేసీ ప్రభాకర్‌రెడ్డి పిచ్చికుక్కలా మారిపోయాడన్నారు. ఎన్నడూ ప్రజల ఇండ్ల ముఖం చూడని జేసీపీఆర్ ఇప్పుడు ఇళ్ల వరకు వస్తున్నాడంటే వారిలో రాజకీయ అస్థిరత ఏర్పడటమే కారణం అన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పెద్దమంతూరులో ఉపాధి పనులు పరిశీలిస్తున్న పీడీ

రొద్దం: మండలంలోని పెద్దమంతూరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి పనులను బుధవారం డ్వామా పీడీ రామాంజనేయులు పరిశీలించారు. బౌండరీ, ట్రెంచ్ పనులను పరిశీలించిన పీడీ.. జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీఓ జగదీశ్వర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతుడు కురుబ శివయ్య

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని రాంపురం గ్రామానికి వెళ్లే రహదారిలో బుధవారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ధర్మవరం రూరల్ పోలీసుల వివరాల మేరకు .. మండలంలోని రావులచెరువుకు చెందిన వ్యవసాయ కూలి కురుబ శివయ్య (40) గుంతకల్లు నుంచి ద్విచక్ర వాహనంలో గ్రామానికి వస్తున్నారు. అలాగే ధర్మవరం పట్టణంలోని పార్థసారధినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు మోహన్ అనంతపురానికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. అయితే రాంపురం సమీపంలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కురుబ శివయ్య అక్కడికక్కడే మృతి చెందారు. ఉపాధ్యాయుడు మోహన్ తీవ్రంగా గాయపడ్డారు. మోహన్‌ను చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. మృతుడు శివయ్యకు భార్య రేవతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



కళాశాలను తనిఖీ చేస్తున్న జిల్లా వృత్తి విద్యాధికారి రఘునాథ్‌రెడ్డి

ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా వృత్తి విద్యాధికారి రఘునాథ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీఫైనల్ పరీక్షలకు హాజరుకాని విద్యార్థినులకు మళ్లీ పరీక్షలు నిర్వహించాలని ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్‌రెడ్డికి సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థినులను గుర్తించి వారికి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని అధ్యాపకులకు ఆదేశించారు.

బైక్ మెకానిక్ కోర్సులో శిక్షణ

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్లో నిరుద్యోగ యువతకు టూ వీలర్ బైక్ మెకానిక్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, 5వ తరగతి నుంచి పది/ఇంటర్/ ఐటీఐ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు 18–35 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులన్నారు. ఫీజు రూ.1500 ఉంటుందన్నారు. శిక్షణా కాలంలో ఉచిత మధ్యాహ్న భోజనం అందిస్తామని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం టూల్ కిట్ ఉచితంగా అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 6303580397, 9390505952 లను సంప్రదించాలన్నారు.

జోరుగా దొంగనోట్ల చలామణి



రూ. 500 దొంగనోటు

పెనుకొండ: కర్ణాటక–ఆంధ్ర సరిహద్దులో దొంగనోట్ల చలామణి అధికంగా జరుగుతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నెల రోజులుగా కొందరు వ్యక్తులు దొంగనోట్లను తీసుకువచ్చి వ్యాపార సముదాయాలు, మద్యం దుకాణాలు, బార్‌లలో చలామణి చేసి అనంతరం పత్తా లేకుండా పోతున్నారని చెబుతున్నారు. రూ. 500, రూ. 200 నోట్లు ఎక్కువగా చలమణి అవుతున్నాయన్నారు. దొంగనోట్లను గుర్తించేలోపు సదరు వ్యక్తులు పత్తా లేకుండా పోతున్నారని చెప్పారు. ఇటీవల రొద్దం మండలం పైడేటి సమీపంలోని కర్ణాటక సరిహద్దులోని ఓ బార్‌లో రూ. 500, 200 నోట్ల చలామణి జరగ్గా ఆలస్యంగా బ్యాంక్ అధికారుల ద్వారా తెలుసుకున్న వ్యాపారులు లబోదిబోమంటున్నారు. పైడేటి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఈ వ్యవహారాన్ని నడుపుతున్నట్లు బార్ నిర్వాహకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

పుట్లూరు: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన అంకమ్మ (78) అనే వృద్ధురాలు బుధవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల వివరాలమేరకు... అంకమ్మకు గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనేపథ్యంలోనే మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.